

తీవ్ర తుఫాన్‌గా మారనున్న 'మొంథా'

- చెన్నై సహా ఉత్తర జిల్లాల్లో అలెర్ట్
- 'వరద ముప్పు'ను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం
- మంత్రి కేకేఎస్ఎస్ రామచంద్రన్



విపత్తుల నిర్వహణ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి కేకేఎస్ఎస్ రామచంద్రన్



చెన్నైలో కురుస్తున్న వర్షం

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఈనెల 28వ తేదీకి తీవ్ర తుపానుగా మారే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ తుఫానుకు ఇప్పటికే థాయ్‌లాండ్ సూచన మేరకు 'మొంథా' అనే పేరు సూచించిన విషయం తెలిసిందే. ఈ తుఫాను కారణంగా చెన్నై సహా ఉత్తరాది జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురవవచ్చని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం పశ్చిమ దిశలో స్థిరంగా ఉంది. అండమాన్, నికోబార్ దీవులకు పశ్చిమ - నైరుతి దిశగా సుమారు 420 కిలోమీటర్లు, చెన్నైకు తూర్పు దిశగా 990 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమం - వాయవ్య దిశగా పయనించి 26 తేదీకి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. ఈ నెల 27న ఉదయం నైరుతి దిశగా పయనించి మధ్య పశ్చిమ బంగాళాఖాతంలో తుఫానుగా మారే అవకాశం ఉంది. ఇది 28న తీవ్ర తుఫానుగా మారే అవకాశం వుంది. ఆ తర్వాత అది ఉత్తరాంధ్ర తీరంవైపు వెళుతుంది. ఈ కారణంగా ఈ నెల 28వ తేదీ వరకు రాష్ట్రంలో ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని ప్రకటించింది. ముఖ్యంగా చెంగల్పట్టు, చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, రాణిపేట జిల్లాల్లో కొన్నిచోట్ల, పుదుచ్చేరిలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, ఈనెల 27న చెన్నై, తిరువళ్లూరు, రాణిపేట జిల్లాల్లో ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

సిద్ధంగా ఉన్నాం

- మంత్రి కేకేఎస్ఎస్ రామచంద్రన్

రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కురిసే భారీ వర్షాల కారణంగా ఏర్పడే ముప్పుతో పాటు ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) శాఖ మంత్రి కేకేఎస్ఎస్ రామచంద్రన్ తెలిపారు. స్థానిక చేపాక్‌లోని ఎళిలగంలో ఏర్పాటు చేసిన స్టేట్ ఎమర్జెన్సీ కంట్రోల్ సెంటరులో ఈశాన్య వరద ముప్పుపై రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవన సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి అనేక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఈ వర్షాల కారణంగా అనేక చెరువులు, డ్యాంలు నిండుతున్నాయన్నారు. ఇలా నిండిన జలవనరుల నుంచి ఉపరితల నీటిని కిందికి విడుదల చేయడంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు వచ్చి చేరుతోందన్నారు. ఇలాంటి ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. చెరువులు, డ్యాంల సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆయన కోరారు. అలాగే పాలు, ఇతర నిత్యావసర వస్తు సరకులను ముందుగానే కొనుగోలు చేసి ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ వర్షాకాలంలో ఆస్తి, ప్రాణనష్టం ఏర్పడకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం స్టాలిన్ ఆదేశించారని, అందుకు అనుగుణంగానే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నట్టు తెలిపారు. వర్షాలు, వరదల వల్ల ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు మంత్రి కేకేఎస్ఎస్ఆర్ వెల్లడించారు. రాష్ట్రంలో ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 31 మంది చనిపోయారని తెలిపారు. వీరిలో కడలూరు జిల్లాలో అధికంగా ఆరుగురు ఉన్నారన్నారు. మరో 47 మంది గాయపడ్డారని తెలిపారు. 485 పశువులు, 20425 కోళ్లు మృత్యువాతపడగా, 1280 గుడిసెలు దెబ్బతిన్నాయన్నారు. ఈ వర్షాల కారణంగా డెల్టా జిల్లాల్లో నష్టపోయిన రైతులను ఆదుకునేలా రెవెన్యూ శాఖ అధికారులు సర్వే చేస్తున్నారన్నారు. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని, దీంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు 210 మంది రక్షణ సిబ్బందిని రెండు శిబిరాల్లో సిద్ధంగా ఉంచినట్టు మంత్రి కేకేఎస్ఎస్ రామచంద్రన్ వివరించారు. కాగా చెన్నైలో శనివారం ఉదయం, సాయంత్రం వేళల్లో స్వల్పంగా వర్షం కురిసింది.

వర్ష బాధిత జిల్లాల్లో కేంద్ర బృందాల పర్యటన

- వరి తేమ శాతం 17 నుంచి 22కు పెంచండి
- రాష్ట్ర ప్రభుత్వ వినతి



చెంగల్పట్టు వచ్చిన కేంద్ర బృందానికి స్వాగతం పలుకుతున్న అధికారులు

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల వర్షాల కారణంగా పలు జిల్లాల్లో నీటమునిగిన పంటలను పరిశీలించేందుకు కేంద్ర బృందాలు తరలివచ్చాయి. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా ఉన్న నేపథ్యంలో, డెల్టా జిల్లాలు సహా పలు ప్రాంతాల్లో సాంబా, తాళడి వరి సీజన్ సాగును రైతులు చేపట్టారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 21 లక్షల హెక్టార్లలో వరి, చిరుధాన్యాలు సహా పలు పంటలు సాగు చేస్తున్నారు. అందులో, 5 లక్షల హెక్టార్లలో వరి సాగవుతుండగా, ప్రస్తుతం 3.60 లక్షల హెక్టార్లలతో పంట కోతకు సిద్ధంగా ఉంది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,819 కొనుగోలు కేంద్రాల ద్వారా 9.67 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ఈశాన్య రుతుపవన వర్షాలతో పలు జిల్లాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం బస్తాలు నీటమునిగాయి. ఈ కారణంగా, 17 శాతం తేమతో కూడిన వరి కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో, తేమ శాతం 22కు పెంచాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రధానమంత్రికి లేఖ రాశారు. ఈ లేఖపై స్పందించిన కేంద్ర ఆహార శాఖ, నీట మునిగిన పంటల్ని పరిశీలించేందుకు మూడు బృందాలను రాష్ట్రానికి పంపింది. ఆ ప్రకారం, మొదటి బృందంలో పంజాబ్ రాష్ట్రం లుధియానాలో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్రెయిన్ స్టోరేజీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చి కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆర్కే సాహి, సాంకేతిక అధికారులు రాహుల్ శర్మ, ధనుజ్ శర్మ ఉన్నారు. రెండో బృందంలో ఆ కేంద్రం డైరెక్టర్ పీకే సింగ్, శోభిత్, రాకేష్ బరాలా, మూడో బృందంలో అసిస్టెంట్ డైరెక్టర్ టీఎం ప్రీతి, ప్రియా భట్, అనుపమ తదితరులున్నారు. ఈ బృందాలు శనివారం నుంచి రాష్ట్రంలో బాధిత జిల్లాల్లో పర్యటించాయి.

చెంగల్పట్టు జిల్లాలో...

మొదటి బృందం చెంగల్పట్టు జిల్లాలో పర్యటించింది. 77 ధాన్యం కొనుగోలు కేంద్రాలుండగా, అయ్యపాక్కం, వెల్లపందల్, దత్తలూరు, వళువత్తూర్, ఈసూరు, పుదూర్, పటాలం, కల్లప్రాణపురం, పోలంబాక్కం, కయపాక్కం తదితర 10 కొనుగోలు కేంద్రాలను కేంద్ర బృందం పరిశీలించింది. ఒక్కో కేంద్రంలో సుమారు 15 నిమిషాలు ఈ బృందం పరిశీలించింది. ఆదివారం తిరువళ్లూర్, కాంచీపురం జిల్లాల్లో ఈ బృందం పర్యటించనుంది. రెండో బృందం శనివారం తంజావూరు, మైలాడుదురై, నామక్కల్ జిల్లాల్లో పర్యటించగా, ఆదివారం తిరువారూరు, నాగపట్టినం తదితర జిల్లాలు, 27న కడలూరు జిల్లాల్లో పర్యటించనుంది. మూడో బృందం శనివారం తిరుచ్చి, పుదుకోట, ఆదివారం తేని, మదురై జిల్లాల్లో పర్యటించనుంది. ఈ బృందాలు బాధిత జిల్లాల్లోని ధాన్యం నమూనాలు సేకరించి, పరిశీలించిన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందించనున్నారు. నివేదిక ఆధారంగా కేంద్రప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని బృందంలోని అధికారులు తెలిపారు.

కేంద్ర బృందం పర్యటన వాయిదా...

కేంద్ర ఆహారశాఖ ఏర్పాటుచేసిన రెండో బృందం శనివారం తంజావూరు జిల్లాలో పర్యటించాల్సి ఉంది. ఈ బృందం జిల్లాలోని వన్నార్‌పేట నార్త్, సౌత్, పొన్నాపూర్, రారాముత్తిరై కోట తదితర ప్రాంతాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తుందని జిల్లా అధికారులు ప్రకటించారు. కానీ, శనివారం చివరి నిమిషంలో కేంద్ర బృందం పర్యటన వాయిదా పడిందని, తదుపరి పర్యటన తేదీ తెలియజేస్తామని అధికారులు తెలపడంతో, రైతులు నిరాశ చెందారు.

రైతు సమస్యల పరిష్కారంలో
డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యం

- బీజేపీ రాష్ట్ర చీఫ్ నయినార్



రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. తంజావూరు సమీపంలోని ఆళకుడిలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం ఉదయం పరిశీలించారు. స్థానిక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు మాట్లాడుతూ.. సుమారు మూడు వారాల క్రితం తాము సరఫరా చేసిన ధాన్యానికి గిట్టుబాటు ధర చెల్లించకపోగా, వాటిని భద్రపరిచేందుకు ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని వాపోయారు. అనంతరం నాగేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ.. తంజావూరు తదితర డెల్టా జిల్లాల్లో ఈ ఏడాది దాదాపు ఆరున్నర లక్షల ఎకరాల్లో వరి ,ధాన్యం ఉత్పత్తి జరిగిందన్నారు., ఇది గత ఏడాది కంటే అధికమని సీఎం స్టాలిన్ దృష్టికి తీసుకెళ్లామని, అయినా ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. సహజంగా రుతుపవనాలు ప్రారంభానికి ముందు అంటే సెప్టెంబర్‌లోనే ధాన్యం కొనుగోలు పనులు ప్రారంభించి ఉండాలన్నారు. అయితే ఈ ప్రభుత్వం మద్యం విక్రయాలపైనే శ్రద్ధ చూపిందని విమర్శించారు. డెల్టా జిల్లాల్లో ఉన్న మార్కెటింగ్ కమిటీల్లో వేల సంఖ్యలో ధాన్యం బస్తాలు పేరుకుపోయాయని, కొన్ని ప్రాంతాల్లో వర్షపునీటిలో తడిసి మొలకలెత్తాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారన్నారు. అయినా నష్టపోయిన రైతులకు ఎలాంటి పరిహారం ప్రకటించకుండా ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు.

పీఎంకేలో ముసలం

- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంతి
- కుమార్తె పేరు ప్రకటించిన రాందాస్



శ్రీకాంతిని పరిచయం చేస్తున్న రాందాస్

ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): 'పాట్టాలి మక్కల్ కట్చి' (పీఎంకే)లో ముసలం మరింత ముదిరింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన కుమార్తె శ్రీకాంతిని ఎంపిక చేసినట్లు ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ అధికారికంగా ప్రకటించారు. రాందాస్, ఆయన కుమారుడు, మాజీ ఎంపీ అన్బుమణి మధ్య ఆధిపత్యపోరు జరుగుతున్న విషయం తెలిసిందే. శ్రీకాంతి కుమారుడిని పీఎంకే యువజన విభాగ అధ్యక్షుడిగా ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన అన్బుమణి.. అధినేతపై తిరుగుబాటు చేశారు. అన్బుమణిని అధ్యక్ష పదవి నుంచి రాందాస్ తొలగించారు. అయితే, పార్టీకి సర్వాధికారిని తానేనంటూ ప్రకటించుకున్న అన్బుమణి.. ఆ మేరకు పార్టీని తన చేతుల్లోకి తీసుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ధర్మపురిలో పీఎంకే రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం రాందాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన శ్రీకాంతిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడిగా, కేంద్రమంత్రిగా, ఎంపీగా వ్యవహరించిన అన్బుమణి పార్టీని బలోపేతం చేసేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేపట్టకుండా పదవి మోహంలో కొనసాగారన్నారు. అందువల్లే ఆయన్ని వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నుండి తొలగించినట్లు వివరించారు. ఖాళీ అయిన ఆ పదవికి తన పెద్దకుమార్తె శ్రీకాంతిని సర్వసభ్య సమావేశం ఆమోదంతో నియమించినట్లు తెలిపారు. ఆమె పార్టీకే కాకుండా రాష్ట్రానికే ఘనత చేకూర్చుతారన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పీఎంకే ఉండే కూటమే విజయం సాధిస్తుందని ఆయన నమ్మకం వ్యక్తంచేశారు. అనంతరం శ్రీకాంతి మాట్లాడుతూ.. పీఎంకేలో తనకు పదవి వస్తుందని కలలో కూడా ఊహించలేదని, తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చుతానని హామీ ఇచ్చారు.

'కరూర్' మృతుల కుటుంబీకులతో రేపు విజయ్ భేటీ

- మహాబలిపురంలో ఏర్పాట్లు



అడయార్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులతో 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ఈనెల 26న సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఇందుకోసం చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలోని ఒక హోటల్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవానికి బాధితులను కరూర్‌లోనే కలుసుకునేలా ఏర్పాట్లు చేయాలని పార్టీ నేతలకు విజయ్ సూచించారు. అయితే, కరూర్‌లో ఈ సమావేశం ఏర్పాటు చేసేందుకు ఒక్క వేదిక కూడా లభించలేదు. దీంతో మహాబలిపురానికి మార్చారు. మృతుల కుటుంబ సభ్యులను టీవీకే నేతలు దగ్గరుండి చెన్నైకు తీసుకురానున్నారు. ఈ సమావేశానికి కేవలం బాధిత కుటుంబీకులను మాత్రమే అనుమతించనున్నారు. విజయ్ రాష్ట్రవ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టగా, గత నెల 27న కరూర్ వేదికగా జరిగిన ప్రచార సభలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా మరో 110 మంది వరకు గాయపడిన విషయం తెలిసిందే. ఈ మృతుల కుటుంబాలతో పాటు క్షతగాత్రులను కలుసుకుని పరామర్శించాలని విజయ్ భావించారు. అయితే, విజయ్ కరూర్ పర్యటనకు జిల్లా పోలీసులు అనుమతించలేదు. మృతుల కుటుంబాల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నందున విజయ్‌ను చూస్తే వారు ఏదేని అవాంఛనీయ ఘటనలకు పాల్పడవచ్చన్న అనుమానంతో పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చే విషయంలో తీవ్ర జాప్యం నెలకొంది. అయితే పోలీసుల అనుమతి కోసం వేచిచూడటం కంటే బాధిత కుటుంబ సభ్యులనే చెన్నైకు తీసుకొచ్చి వారిని పరామర్శించాలని నిర్ణయించారు. ఇందుకోసం మహాబలిపురంలో ఫోర్ పాయింట్స్ హోటల్‌లో ఈ సమావేశానికి ఏర్పాట్లు చేశారు. 27వ తేదీ ఉదయం 9 గంటలకు ఈ సమావేశం ప్రారంభంకానుంది. ఇందులో 41 మంది మృతుల కుటుంబ సభ్యులు పాల్గొనున్నారు. వీరిలో 31 మంది కరూర్ జిల్లాకే చెందిన వారు ఉన్నారు. మిగిలిన పది మందిలో దిండుగల్, ఈరోడ్, సేలం జిల్లాలకు చెందిన వారున్నారు. వీరందరినీ ఆయా జిల్లాలకు చెందిన టీవీకే నేతలు చెన్నైకి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. కేవలం మృతుల కుటుంబ సభ్యులను మాత్రమే కాకుండా తొక్కిసలాటలో గాయపడిన మరో 110 మంది మంది కుటుంబ సభ్యులను కూడా ఆయన పరామర్శించనున్నారు. ఈ బాధితులను చెన్నైకు తీసుకొచ్చేందుకు వీలుగా కరూర్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

చెన్నైలో దెబ్బతిన్న 2 వేల రోడ్లు

- మరమ్మతులు ప్రారంభించాం
- మేయర్ ప్రియ



స్థానిక రాయపురం జోన్ బకింగ్‌హామ్ కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు

ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు చెన్నై నగరంలో దెబ్బతిన్న 2వేలకు పైగా రోడ్లకు మరమ్మతులు ప్రారంభించినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ పేర్కొన్నారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో నగరంలో గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో చేరిన నీటిని తొలగించే పనులు 15 కార్పొరేషన్ జోన్లలో ముమ్మరంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం రాయపురం జోన్ చైర్మన్ పి.శ్రీరాములు అధ్యక్షతన చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై నిర్వహించిన సమావేశంలో మేయర్, మంత్రి పీకే శేఖర్‌బాబు, జీసీసీ నీటి పారుదలశాఖ, ఆరోగ్యశాఖ, రహదారులశాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం వారు వాల్‌టాక్స్‌రోడ్డు, అన్నాపిళ్లైవీధి, ఉడ్‌వార్ఫ్ ప్రాంతాల్లో ఉన్న బకింగ్‌హాం కాలువలో చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మీడియాతో మాట్లాడుతూ.. గత వారం కురిసిన భారీవర్షాలకు 200 వార్డుల్లో సుమారు 2వేలకు పైగా రోడ్లు దెబ్బతిన్నాయని, పలు ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలను పూడ్చే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నగరంలో 200 ప్రాంతాలను లోతట్టు ప్రాంతాలుగా గుర్తించి వాన నీటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు మోటారు పంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరద నీరు చేరిన నివాస ప్రాంతాలకు చెందిన ప్రజలకు కార్పొరేషన్ కమ్యూనిటీ హాలు, చెన్నై పాఠశాలల భవనాల్లో ఆశ్రయం కల్పించి అవసరమైన ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. సహాయక పనుల్లో అధికారులు, ఇంజనీర్లు, పారిశుధ్య కార్మికులు సహా 22వేల మందికి పైగా పాల్గొంటున్నారని, నగరంలో 15సెంటీమీటర్ల స్థాయికి వర్షం కురిసినప్పటికీ వెంటనే తొలగించే విధంగా కాలువల్లో పూడికతీత పనులను వేగవంతం చేసినట్లు మేయర్ తెలిపారు.

సొంతూరికి వెలుగులు

SUNDAY SPECIAL

పోలీసు దంపతుల ఔదార్యం

● 60 అడుగుల హైమాస్ట్ లైట్ ఏర్పాటు


భారీ క్రేన్ ద్వారా స్తంభాన్ని నిలబెడుతున్న ఇంజనీర్లు, వెలుగులు జిమ్ముతున్న ఫోకస్ లైట్లు

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి' - అంటే జన్మనిచ్చిన తల్లి, జన్మభూమి స్వర్గం కంటే గొప్పవని రామాయణంలోని ఈ సంస్కృత శ్లోకం చాటి చెబుతోంది. ప్రతి మానవుడూ జన్మనిచ్చిన మాతృమూర్తిని, జన్మించిన భూమిని (మాతృ దేశాన్ని) మరువకూడదని, ఎంత ఉన్నత స్థితికి చేరినా తన ప్రాంతం బాగోగులను పట్టించుకోవాలని పెద్దలు చెబుతారు. కడలూరు జిల్లాకు చెందిన ఓ పోలీసు దంపతులు ఆ రామాయణ శ్లోకంలో నుడివినట్లే తమకు జన్మనిచ్చిన ఊరిని కొత్త వెలుగులతో నింపి అందరి ప్రశంసలందుకుంటున్నారు. కడలూరు జిల్లాకు చెందిన ఆ దంపతుల సత్కార్యాన్ని పోలీసు ఉన్నతాధికారులు సైతం మెచ్చుకున్నారు. ఆ దంపతుల పేర్లు అరుణ్‌కుమార్, గాయత్రి. వీరిలో అరుణ్‌కుమార్ పుదుచ్చేరిలో ప్లస్-2 చదివి, బన్రూట్టిలో 2016లో 'ట్రిపుల్ ఈ' లో డిగ్రీ చేశారు. 2017లో పోలీసు ఎంపిక పరీక్షల్లో ఎంపికై విధుల్లో చేరారు. గాయత్రి బీఎస్సీ, బీఈడీ చదివి 2017లోనే పోలీసు సర్వీసులో చేరారు. ఒకే గ్రామానికి చెందిన ఈ కానిస్టేబుళ్లు ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. తమ ఇరువురికీ జన్మనిచ్చిన కొంగరాయనూరుకు ఏదైనా చేయాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా ఊరికి వెలుగులు ప్రసాదించారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి


గాయత్రి, అరుణ్‌కుమార్

తల్లిదండ్రులను ఒప్పించి...

కానిస్టేబుల్ అరుణ్‌కుమార్ కడలూరు జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్నారు. గాయత్రి కడలూరు సాయుధదళ కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ఇద్దరూ కొంగరాయనూరుకి చెందినవారు. కులం పట్టింపులు లేకుండా చిన్ననాటి నుండి ఆత్మీయుల్లా మెలుగుతుండేవారు. వీరి స్నేహబంధం కాస్తా ప్రేమబంధంగా మారింది. ఇద్దరూ తల్లిదండ్రులను ఒప్పించి, వారి అంగీకారంతో 2020లో వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. డ్యూటీలో క్రమశిక్షణ కలిగిన కానిస్టేబుళ్లుగా పేరుతెచ్చుకున్న ఈ పోలీసు దంపతులు తమకు జన్మనిచ్చిన గ్రామానికి ఏదైనా చేయాలని అనుకున్నారు. అలా ఆలోచిస్తున్నప్పుడు ఆ ఊరి ప్రజల ప్రధానమైన సమస్య చటుక్కున గుర్తుకు వచ్చింది.

చిమ్మచీకట్లు...

పొద్దుగుంకితే ఆ ఊరి బస్‌స్టాప్ ప్రాంతమంతటా చిమ్మచీకటి ఆవరిస్తుంది. ఆ చీకటిలో బస్‌స్టాప్ వద్ద బస్సుకోసం నిలిచేందుకు యువతులు, బాలికలు భయపడుతుంటారు. అంతేకాకుండా చీకటి పడితే ఆ ప్రాంతంలో పాములు సంచరిస్తుంటాయి. ఊరివారంతా తమ అవసరాలకు బస్‌స్టాప్ నుండి రెండు కిలోమీటర్ల దూరం వరకూ దట్టమైన చీకటి దారిలోనే నడిచివెళుతుంటారు. ఇవన్నీ గుర్తుకురాగానే ఆ ఊరికి వెలుగును ప్రసాదించాలని నిర్ణయించుకున్నారు.

హైమాస్ట్ లైట్ ఏర్పాటు...

ఆ బస్టాప్ ప్రాంతం వద్ద రెండు కిలోమీటర్ల దూరం వరకు ఫ్లడ్‌లైట్లలాగా వెలుగులు ప్రసరించే విధంగా ఎత్తయిన హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని ఇద్దరు సంకల్పించారు. 60 అడుగుల ఎత్తుతో 6 లైట్లతో హై మాస్ట్ లైట్ ఏర్పాటు చేయడానికి ఎంత ఖర్చవుతుందో ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరూ తమ నెలజీతంలో కొంతభాగాన్ని హైమాస్ట్ లైట్ కొనుగోలు కోసం పొదుపు చేశారు. అదే సమయంలో ప్రతినెలా కొంత సొమ్ముతో ఆ లైట్ స్తంభం ఏర్పాటు కోసం అవసరమైన ఇనుప క్లాంప్‌లు, రేకులు, నట్లు, బోల్టులు, స్విచ్ బోర్డు తదితర విడి పరికరాలు కొనుగోలు చేస్తూ వచ్చారు. చివరకు హైమాస్ట్ లైట్‌కు అవసరమైన డబ్బులు పోగయ్యాయి. ఆ వెంటనే ఇరువురూ ఇంజనీర్లు, స్థానిక యువకుల సాయంతో ఊరి బస్టాప్ వద్ద హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బస్‌స్టాప్ నుండి రెండు కిలోమీటర్ల దూరం వరకూ సూర్యకాంతిని తలపించేలా 60 అడుగుల ఎత్తు నుంచి హైమాస్ట్ లైట్ ప్రసరించే వెలుతురులో ఊరి వారంతా నిర్భయంగా నడుస్తున్నారు.


తమ పిల్లలతో కానిస్టేబుల్ దంపతులు


అరుణ్‌కుమార్, గాయత్రిని అభినందిస్తున్న కడలూరు ఎస్పీ జయకుమార్

ఎస్పీ సహా ప్రముఖుల ప్రశంస...

కానిస్టేబుల్ దంపతులు అరుణ్‌కుమార్, గాయత్రి కొంగరాయనూరు బస్టాప్ వద్ద తమ సొంత ఖర్చుతో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేసిన విషయం తెలుసుకున్న కడలూరు ఎస్పీ జయకుమార్ తమ కార్యాలయానికి ఆహ్వానించి ఇద్దరినీ శాలువలతో సత్కరించారు. ఎస్పీ కార్యాలయంలోని ఉన్నతాధికారులంతా ఈ దంపతులకు పుష్పగుచ్ఛాలందించి అభినందించారు. ఈ సందర్భంగా ఈ దంపతులు మాట్లాడుతూ. 'మనం నివసించే ఇంట్లో చీకటిగా ఉంటే చూస్తూ ఊరుకుంటామా? జన్మనిచ్చిన ఊరు కూడా అంతే. ఆ భావంతోనే మాకు తోచిన సాయం చేశాం' అంటూ వినమ్రంగా పేర్కొన్నారు.

జన్మభూమికి సాయం...: ఈ విషయమై కానిస్టేబుల్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ... తమ ఇద్దరికీ జన్మనిచ్చిన ఊరికి ఏదైనా చేయాలని ఎప్పటి నుంచో అనుకునేవాళ్లమని, ఊరి ప్రజల ప్రధాన సమస్యను కనుగొనేందుకు కాస్త మయం పట్టిందన్నారు. బస్‌స్టాప్ వద్ద రాత్రి 10గంటల దాకా ప్రజలు బస్సుకోసం వేచి ఉంటున్నారని, రెండు కిలోమీటర్ల దూరం వరకూ చిమ్మచీకటిలోనే పురుగూపుట్రకు భయపడుతూ వెళుతుంటారు. మొదట అక్కడ సోలార్ ఎనర్జీతో పనిచేసే హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని అనుకున్నామని తెలిపారు. అయితే వెంటనే ఆ లైట్‌ను ఏర్పాటు చేయడానికి అవసరమైన డబ్బులు లేకపోవడంతో ప్రతినెలా ఇద్దరి జీతంలో కొంత భాగాన్ని ఆ లైట్ కోసం పొదుపు చేశామని తెలిపారు. చివరకు అనుకున్నది సాధించామనే ఆత్మ సంతృప్తి మిగిలిందన్నారు. గాయత్రి మాట్లాడుతూ.. తమ ఊరి బస్ స్టాప్ వద్ద తామిరువురమూ యేళ్ల తరబడి చీకటిదారిలోనే భయపడుతూ వెళుతుండేవారమన్నారు. కొన్ని సందర్భాల్లో టార్చిలైట్ల వెలుతురుతో నడిచేవారమని తెలిపారు. ప్రస్తుతం రెండు కిలోమీటర్ల దాకా వెలుగులు ప్రసరించే ఆ ఎత్తయిన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో ఊరివారంతా ప్రత్యేకించి యువతులు, మహిళలు సంతోషిస్తున్నారని చెప్పారు.


బస్ స్టాప్ వద్ద హైమాస్ట్ లైట్ స్తంభాన్ని నాటుతున్న ఇంజనీర్లు, యువకులు

చిత్రజ్యోతి

గ్లామర్ పాత్రలపై కయదు ఆసక్తి?

'డ్రాగన్' మూవీతో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన కయదు లోహర్ ఇపుడు గ్లామర్ పాత్రలపై ఆసక్తి చూపుతున్నారు. సినీ ఇండస్ట్రీలో పది కాలాల పాటు మనుగడ కొనసాగించాలంటే చీరకట్టులోనే కనిపిస్తే సరిపోదని, గ్లామర్ పాత్రల్లో కూడా చేయాలన్న సత్యాన్ని గ్రహించారు. ఇందులోభాగంగా తొలుత ఎక్స్‌పోజింగ్ చేస్తూ ఒక ప్రత్యేక ఫొటో, వీడియో షూట్ చేసి వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. వాస్తవానికి 'డ్రాగన్' తర్వాత కోలీవుడ్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న కయదు.. ఆ తర్వాత కొన్ని వివాదాస్పద చర్చల్లో చిక్కుకున్నారు. దీంతో ఆమెను తమ చిత్రాల్లో ఎంపిక చేసుకునేందుకు దర్శక నిర్మాతలు వెనుకంజ వేశారు. ఇపుడు 'ఇదయం మురళి' అనే చిత్రంలో నటించగా, అది త్వరలోనే విడుదలకానుంది. ఆ తర్వాత విశాల్, జీవీ ప్రకాష్ చిత్రాల్లో నటించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతేకాకుండా, పెద్ద హీరోల సరసన డ్యూయెట్లు పాడాలని, భారీ పారితోషికాన్ని అందుకోవాలన్న తపనలో కయదు ఉన్నారు. అందుకే ఆమె గ్లామర్ పాత్రలు, ఎక్స్‌పోజింగ్ వైపు మొగ్గు చూపుతున్నారు.


కయదు లోహర్

సినిమా విడుదలకు ముందే ఆర్‌కేవీకి వరుస అవకాశాలు


ఆర్‌కేవీ (ఆర్‌కే వరదరాజ్)

కడలూరు జిల్లా నైవేలికి చెందిన నటుడు ఆర్‌కేవీ (ఆర్.కె.వరదరాజ్) తమిళ సినిమాలో వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. తన విలక్షణమైన లుక్‌తో పాటు ప్రతిభ కారణంగా ఆయనకు పలువురు దర్శక నిర్మాతలు అవకాశాలు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆయన నటించిన 'వట్టకానల్' ఇంకా విడుదలకాకముందే రెండు మూడు చిత్రాల్లో అవకాశాన్ని దక్కించుకున్నారు. తొలి చిత్రంలోనే ఆయన మంచి నటనతో ఆకట్టుకున్నారని యూనిట్ సభ్యులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆర్‌కేవీ ప్రధాన పాత్రను పోషించిన 'వట్టకానల్' విడుదలకు సిద్ధమైంది. స్కై లైన్ సినిమాస్‌తో కలిసి ఎంఆర్‌పీ ఫిలిమ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. నూతన దర్శకుడు పితహ్ పుగళేంది కథను సమకూర్చి దర్శకత్వం వహించారు. ధృవన్, మీనాక్షి సౌందరరాజన్ జంటగా నటించగా సీనియర్ నటుడు ఆర్‌కే సురేష్ ముఖ్య పాత్రను పోషించారు. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సినీ ప్రముఖుల కోసం ప్రదర్శించగా, ఆర్‌కేవీ నటనను ప్రతి ఒక్కరూ ప్రశంసించారు. విలక్షణమైన లుక్‌లో ప్రతినాయకుడి పాత్రను అద్భుతంగా పోషించారంటూ కితాబిస్తున్నారు. పలు చిత్రాల్లో చిన్నచిన్న పాత్రలను పోషించిన ఆర్‌కేవీకి ఈ మూవీ టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుందని ఆశిస్తున్నారు.

రెండు నెలలు బోసిపోనున్న థియేటర్లు



కోలీవుడ్‌లో రానున్న రెండు నెలలు థియేటర్లు బోసిబోయి కనిపించనున్నాయి. నవంబరు, డిసెంబరుల్లో పెద్ద సినిమాలేవీ విడుదలకు సిద్ధంగా లేవు. దీంతో థియేటర్ల వద్ద ప్రేక్షకుల సందడి అంతంత మాత్రంగా కనిపించనుంది. ప్రస్తుతం దీపావళి సీజన్ ముగిసింది. ఈ పండుగ సందర్భంగా విడుదలైన చిత్రాల్లో రెండు మూడు మాత్రమే ప్రేక్షకుల ఆదరణ పొందాయి. వీటిలో మొదటి స్థానంలో 'డ్యూడ్', రెండో స్థానంలో 'బైసన్', మూడో స్థానంలో 'డీజిల్' నిలిచాయి. ఇతర పెద్ద హీరోల చిత్రాలు విడుదలకాలేదు. దీంతో కోలీవుడ్‌లో దీపావళి సీజన్‌లో కొత్త రికార్డులు ఏవీ నమోదుకాలేదు. అదేసమయంలో ఈ నెల 31వ తేదీన విష్ణు విశాల్ నటించిన 'ఆర్యన్', రియో రాజ్ 'ఆన్‌పావమ్ పొల్లాదదు', పూవైయార్ నటించిన 'రామ్ అబ్దుల్లా ఆంటోని'తో కొత్త నటీనటులు నటించిన 'తడై అదై ఉడై', 'వట్టకానల్' సినిమాలు ఉన్నాయి. నవంబరు నెలలో దుల్కర్ సల్మాన్ నటించే 'కాంతా', కవిన్ 'మాస్క్', 'అస్త్ర' చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఆ తర్వాత డిసెంబరు 5న కార్తి హీరోగా తెరకెక్కిన 'వా వాత్తియార్', డిసెంబరు 18న ప్రదీప్ రంగనాథన్ నటించిన 'ఎల్‌ఐకే', సినిమాలు విడుదలకానున్నాయి. వీటిలో కూడా 'ఆర్యన్', 'వా వాత్తియార్', 'ఎల్‌ఐకే' చిత్రాలపై ఎక్కువ ఆశలున్నాయి. మొత్తంమీద నవంబరు, డిసెంబరు నెలల్లో కోలీవుడ్‌లో పెద్దగా చెప్పుకోదగిన సినిమాలు లేకపోవడం గమనార్హం. ఈ రెండు నెలలు థియేటర్లు బోసిబోయి కనిపించనున్నాయి.

'హ్యాట్రిక్' హీరో ప్రదీప్ రంగనాథన్

● రూ.వంద కోట్ల క్లబ్‌లో మూడు చిత్రాలు

తమిళ చిత్రపరిశ్రమలో ఏ అగ్ర హీరోలకు సాధ్యం కాని ఫీట్‌ను యువ నటుడు ప్రదీప్ రంగనాథన్ (పీఆర్) సొంతం చేసుకున్నారు. ఆయన నటించిన మూడు చిత్రాలు వరుసగా రూ.100 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టాయి. దీంతో కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్ నిర్మాతలు సైతం పీఆర్‌తో సినిమాలు తీసేందుకు పోటీ పడుతున్నారు. 'తక్కువ బడ్జెట్.. అధిక లాభాలు' అనే కాన్సెప్టుతో ప్రదీప్ రంగనాథన్ చిత్రాలు ఉంటున్నాయి. ఇది మంచి ఫలితాన్ని ఇచ్చింది. ఫలితంగా పీఆర్ హీరోగా నటించిన దర్శకత్వం వహించిన 'లవ్ టుడే' మూవీ రూ.వంద కోట్లను రాబట్టింది. ఆ తర్వాత అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో వచ్చిన 'డ్రాగన్' ఘన విజయం సాధించడంతో పాటు రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ దీపావళికి వచ్చిన 'డ్యూడ్' బ్లాక్‌బస్టర్ హిట్ మూవీగా నిలిచింది. తెలుగు నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కించారు. ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లను వసూలు చేసింది. ఈ విషయాన్ని మేకర్స్ కూడా ఓ పోస్టరు రూపంలో అధికారికంగా ప్రకటించారు. కాగా, ఇటీవల ఏ ఒక్క తమిళ హీరోలు వరుసగా హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం.


'లవ్‌టుడే'లో ప్రదీప్ రంగనాథన్, ఇవానా - 'డ్రాగన్'లో ప్రదీప్ రంగనాథన్ - 'డ్యూడ్'లో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


అమింజికరైలో నాగశిల్పాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు - రామ్‌నగర్‌లో నాగదేవత విగ్రహానికి క్షీరాభిషేకం

ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ రాంనగర్‌లోని పురాతన నాగ దేవత ఆలయంలో శనివారం నాగుల చవితి వేడుకల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ ఆలయంలో యేటా నాగుల చవితిని ఏడు రోజుల పాటు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది 29వ వార్షిక నాగుల చవితి క్షీరాభిషేకం ఈ 21న స్తంభస్థాపన పూజలతో ప్రారంభమయ్యాయి. శుక్రవారం గణపతి హోమం, గోపూజ, నారికేళ జలాలతో అభిషేకం, 51 మంది ముత్తైదువుల సామూహిక దీపపూజలు శాస్త్రోక్తం నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 6వ వీధిలో ఉన్న మాతమ్మ ఆలయం నుంచి చిన్నారులు, మహిళలు క్షీర కలశాలతో మేళతాళాల నడుమ నాలుగవ వీధిలో ఉన్న నాగదేవత ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ నాగదేవత విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో రామ్‌నగర్, ఆదిఆంధ్ర సంక్షేమ సఘం, అన్ని ఆలయాల నిర్వాహకులు, నాగదేవత ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.


రామ్‌నగర్‌లో క్షీర కలశాలతో మహిళల ఊరేగింపు

ఎస్‌కేపీడీలో...

జార్జిటౌన్‌లో ప్రసిద్ధి చెందిన శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) ప్రాంగణంలో ఉన్న పుట్టలో పాలు పోసి, సర్పదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో ఈ నెల 22న ప్రారంభమైన స్కందషష్ఠి మహోత్సవం వచ్చే 28వ తేదీ వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి తిరుకల్యాణం వరకు కొనసాగనుంది. గత మూడు రోజులుగా స్వామివారిని హంస, సూర్యప్రభ, భూత వాహన సేవలు జరుగగా, శనివారం జరిగిన నాగవాహన సేవల్లో ఎస్‌కేపీడీ ధర్మకర్త, ట్రస్టీలు, కార్యదర్శి, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నాగచతుర్థిని పురస్కరించుకుని ముత్తైదువులకు పసుపు కుంకుమ, ప్రసాదాలు పంపిణీ చేశారు.


శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో నాగుల చవితి విశేష పూజలు

మధుమేహంపై మరిన్ని పరిశోధనలు

● మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మధుమేహంపై మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉందని మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వి.మోహన్ పేర్కొన్నారు. బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని సెంటర్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్, యూకే డిమెన్షియా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ మధుమేహం, మెదడు ఆరోగ్యం మధ్య సంక్లిష్ట సంబంధాన్ని గుర్తించే అత్యాధునిక పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడానికి చేతులు కలిపాయి. ఈ మేరకు ఈ మూడు సంస్థల మధ్య శనివారం చెన్నైలో ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.మోహన్‌తో పాటు ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఆర్ఎం అంజనా, డిమెన్షియా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సిద్ధార్థ చంద్రన్, బెంగళూరులోని ఐఐఎస్సీ సెంటర్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.ఎస్ హరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ మాట్లాడుతూ.. డయాబెటిస్ శరీరాన్ని మాత్రమే కాకుండా మెదడును కూడా ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవడానికి తమ పరిశోధన మైలురాయిని సూచిస్తుందని తెలిపారు. డయాబెటిస్, జీవక్రియ ఆరోగ్యంలో తమ దశాబ్దాల కృషితో, ప్రముఖ న్యూరో సైంటిస్టులు, చిత్తవైకల్య పరిశోధకులతో చేతులు కలపడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది జీవన నాణ్యతను మెరుగపరిచే విధానాలను కనుగొనాలని తాము ఆశిస్తున్నట్లు వివరించారు.


ఒప్పంద కార్యక్రమంలో వైద్యనిపుణులు

ఇంటి ప్రాంగణంలోకి కొండ చిలువ

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి ప్రాంగణంలో చేరిన భారీ కొండ చిలువను అటవీ శాఖ సిబ్బంది చాకచక్యంగా బంధించారు. కన్నియాకుమారి జిల్లా పుత్తేరికి చెందిన మురుగన్ ఇంటి ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం పెద్ద కొండ చిలువ ఉండడం గమనించారు. ఈ విషయాన్ని వెంటనే అటవీ శాఖ కార్యాలయానికి తెలియజేశారు. అటవీ రేంజర్ దీప నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకుని కొండ చిలువను బంధించి, సమీపంలోని అడవిలో వదిలిపెట్టారు.


కొండ చిలువను బంధిస్తున్న దృశ్యం

భారీ వర్షాలతో రబ్బరు పరిశ్రమకు తీవ్రనష్టం

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రబ్బరు పరిశ్రమ తీవ్ర నష్టం ఎదుర్కొంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కన్నియాకుమారి జిల్లా కొండ ప్రాంతాలైన పేచ్చిపారై, పెరుంజాని, గోదైయారు, పత్తుకాని, అరుకాని తదితర ప్రాంతాలు, పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల దిగువన సుమారు 20 వేల ఎకరాల్లో రబ్బరు చెట్లు సాగుచేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రతిరోజు సుమారు 10,000 మందికి పైగా కార్మికులు పాల్గొంటున్నారు. వారిలో అధిక శాతం కార్మికులు, తమకు తెలిసిన పని రబ్బరు వ్యవసాయం మాత్రమే అని చెబుతుంటారు. ఈ క్రమంలో, వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రబ్బరు పరిశ్రమ స్తంభించడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. తమకు తగిన పరిహారం అందజేసి ఆదుకోవాలని రబ్బరు కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



సమాచార ధ్వని

'ఇన్నుయిర్ కాప్పోం' పొడిగింపు

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలులో ఉన్న ఇన్నుయిర్ కాప్పోం పథకాన్ని పొడిగించినట్టు ఆరోగ్య శాఖ కార్యదర్శి సెంథిల్ కుమార్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయాన్ని అడ్డుకొనేలా గాయపడిన వారికి 48 గంటల్లోపు మెరుగైన చికిత్సలు అందించేలా 'ఇన్నుయిర్ కాప్పోం-నమ్మై కాక్కుం 48' పథకం అమలులో ఉందన్నారు. ఈ పథకాన్ని 2027 జనవరి 10వ తేది వరకు పొడిగించినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది.

వృత్తి శిక్షణకు హిజ్రాలకు ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ 'వెట్రి నిశ్చయం' పథకంలో హిజ్రాలకు ఆర్థికాభివృద్ధి కల్పించేలా మేకలు, గొర్రెల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న హిజ్రాలు, dadtrgsvg@gmail.com అనే ఈ-మెయిల్, నెం.9750886927లో సంప్రదించవచ్చని సచివాలయం పేర్కొంది.

యూకో బ్యాంక్‌లో 'అప్రెంటీస్' శిక్షణ

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అప్రెంటీస్ శిక్షణ పథకం కింద 20 నుంచి 29 ఏళ్లలోపున్న 532 మందికి యూకో బ్యాంక్‌లో సంవత్సరం శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణా కాలంలో ప్రతినెలా రూ.15,000 ప్రోత్సాహక వేతనం అందిస్తారు. ఆసక్తి కలిగిన వారు www.uco.bank.inలో ఈ నెల 28వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

నాగూర్ దర్గాకు 45 కిలోల చందనం

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగూర్ దర్గా గంధ మహోత్సవానికి 45 కిలోల చందనపు దుంగలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి స్టాలిన్ ఉచితంగా అందజేశారు. ప్రసిద్ధిచెందిన నాగపట్టినం జిల్లా నాగూర్ దర్గా గంధ మహోత్సవం త్వరలో జరుగనుంది. ఈ ఉత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున 45 కిలోల చందనం దుంగలు ఉచితంగా అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఆ ప్రకారం, స్థానిక సచివాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమలో, చందనం ఉచితంగా అందించే జీవోను నాగూర్ దర్గా ట్రస్టీ సయ్యద్ మహ్మద్ ఖాజీ హుస్సేన్ సాహిబ్, పారంపర్య ట్రస్టీ ఖాజీ సయ్యద్ మహ్మద్ ఖలీఫా సాహిబ్ ఖాత్రి తదితరులకు సీఎం అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ శాఖ మంత్రి నాజర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐఆర్ నెట్ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే డిసెంబరు నెలలో నిర్వహించనున్న రెండవ విడత సీఎస్ఐఆర్ నెట్ పరీక్ష దరఖాస్తు స్వీకరణ ఈనెల 27వ తేది వరకు పొడిగించారు. దేశంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేసేందుకు, పోస్ట్ గ్రాడ్యుయేట్ పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ పొందేందుకు నెట్‌లో ఉత్తీర్ణులు కావల్సి ఉంది. ఈ సంవత్సరం సీఎస్ఐఆర్ నెట్ రెండో విడత పరీక్ష డిసెంబరు 18వ తేది జరుగనుంది. ఈ పరీక్షకు దరఖాస్తు స్వీకరణ గత నెల 25న ప్రారంభమై శుక్రవారం (ఈ నెల 24వ తేది) ముగిసింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 27వ తేది వరకు పొడిగించారు. అర్హులైన వారు csirnet.nta.ac.inలో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే, దరఖాస్తులో లోపాల సవరణకు అక్టోబరు 30, నవంబరు 1వ తేదీల్లో అవకాశం కల్పించనున్నారు.

సిప్కాట్ కేంద్రం ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దురైమురుగన్

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాణిపేటలో సిప్కాట్ కేంద్రాన్ని శనివారం ఉదయం నీటి పారుదల శాఖ మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో చేనేతశాఖ మంత్రి గాంధీ అధ్యక్షతన జరిగిన చేనేత వస్త్ర ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి దురైమురుగన్ మీడియాతో మాట్లాడుతూ... భారీవర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని, దీని ప్రభావాన్ని తగ్గించేందుకు రిజర్వాయర్లలోని నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అయితే పీసీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న చెంబరంబాక్కం రిజర్వాయర్ నుంచి తనకు సమాచారం అందించకుండా నీటిని విడుదల చేయడంపై అధికా రులను ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రిజర్వాయర్ నిండితే నీటిని దిగువకు విడుదల చేయడం సర్వసాధారణమన్నారు. దీన్ని ఆ ప్రాంత ఎమ్మెల్యేకు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. రాణిపేట ఎమ్మెల్యే చంద్రకళ, ఏర్కాడు ఎమ్మెల్యే ఈశ్వరప్పన్, జిల్లా ఎస్పీ అయిమన్ జమాల్, సిప్కాట్ జనరల్ మేనేజర్ ఆనంద్ సహా జిల్లా డీఎంకే నిర్వాహకులు పాల్గొన్నారు.

కరూర్ మృతుల కుటుంబాలకు 'కేంద్ర' పరిహారం

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరూర్ మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల పరిహారం శుక్రవారం రాత్రి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి. టీవీకే అధ్యక్షుడు విజయ్ గత నెల 27వ తేది కరూర్‌లో నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందగా, 110 మంది గాయపడిన విషయం విదితమే. ఈ ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలు, గాయపడిన వారిని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని బృందం స్వయంగా కలుసుకుని ఓదార్చింది. ఆ సమయంలో, కేంద్రప్రభుత్వం తరఫున ప్రధానమంత్రి మోదీ జాతీయ విపత్తుల నివారణ నిధుల నుంచి మృతి చెందిన వారి కుటుంబాలకు తలా రూ.2 లక్షలు, గాయపడిన వారికి తలా రూ.50,000 అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నివారణ సాయం మృతుల కుటుంబ సభ్యుల ఖాతాల్లో శుక్రవారం రాత్రి జమ చేశారు. ఈ మేరకు వారి సెల్‌ఫోన్‌లో మెసేజ్ అందింది. కాగా, ఈ ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రకటించిన రూ.20 లక్షల పరిహారం గత వారం వారి బ్యాంక్ ఖాతాలో జమచేశారు.

పుట్టినరోజు వేడుకల కోసం బయలుదేరి..

● అనంత లోకాలకు ఐదుగురు స్నేహితులు



ప్రమాదానికి గురైన కారు - మృతులు అగత్తియన్, ప్రభాకరన్, శబరి, ప్రకాష్

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా చెట్టిపాళయం సమీపంలో అదుపు తప్పిన కారు రోడ్డు పక్కనే వున్న చెట్టును ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు యువకులు దుర్మరణం చెందారు. పుట్టిన రోజుల వేడుకల కోసం బయలుదేరిన ఆ ఐదుగురు యువకులు అనంత లోకాలకు పయనమవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తంజావూరుకు చెందిన హరీష్ (20), ప్రకాష్ (20), తిరుచ్చికి చెందిన శబరి (20) అదే నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. వారికి అరియలూరుకు చెందిన అగత్తియన్ (20), వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యానవన విభాగంలో మూడవ సంవత్సరం చదువుతున్న ప్రభాకరన్ (23) స్నేహితులు. హరీష్ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించిన స్నేహితులు.. శుక్రవారం అర్ధరాత్రి కారులో దూరప్రాంతానికి బయలుదేరారు. సిరువాణి రోడ్డు - తెలుంగుపాళయం జంక్షన్ సమీపంలో వేగంగా వెళ్తున్న వాహనం హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చింత చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జైంది. ఈ ఘటనలో హరీష్, ప్రకాష్, శబరి ఘటనా స్థలంలోనే మృతిచెందగా, అగత్తియన్, ప్రభాకరన్‌కు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక అగత్తియన్, ప్రభాకరన్ శనివారం ఉదయం మృతిచెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. యువకులు మద్యం తాగి కారు వేగంగా నడిపినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

వైద్య శిబిరానికి విశేష స్పందన

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేలూరు వీఐటీ వైస్ ప్రెసిడెంట్ బి.వి.సెల్వం జన్మదినాన్ని పురస్కరించుకుని వేలూరు తిరుమలై కోటినారాయణి ఆస్పత్రి ప్రాంగణంలో నగర పోలీసు అధికారుల ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎస్ నిర్వాహకులకు ఉచిత వైద్యశిబిర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వేలూరు డీఐజీ ధర్మరాజన్ అధ్యక్షత వహించగా, నారాయణి గ్రూప్స్ అధ్యక్షుడు డాక్టర్ బాలాజీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా వేలూరు వీఐటీ వైస్ ప్రెసిడెంట్ సెల్వం జ్యోతిప్రజ్వలన చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రూ.5లక్షల విలువైన సహాయాలను పేదలకు పంపిణీ చేశారు. సుమారు 100 మంది ఆర్ఎస్ఎస్ నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్యచికిత్సలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు అధికారులు, డాక్టర్ తిల్లైవాసన్, ఆర్ఎస్ఎస్ నిర్వాహకులు రామకుమార్, మోహన్, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు

ఘనంగా గురుస్థాన పూజా మండపం ప్రారంభం



మండపాన్ని ప్రారంభిస్తున్న శక్తిఅమ్మ తదితరులు

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని శ్రీపురం స్వర్ణాలయ ప్రాంగణంలో గురుపూజా మండపాన్ని శనివారం ఉదయం ఆ అలయ వ్యవస్థాపకుడు శక్తిఅమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ హాజరయ్యారు. ఈ క్రమంలో ఆలయంలో జరిగిన చండీయాగంలో కేంద్ర మంత్రి దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన గురుపూజా మండపానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్, స్వర్ణాలయ డైరెక్టర్ సురేష్‌కుమార్, నారాయణి పీఠం మేనేజర్ సంపత్, ట్రస్టీ సౌందరరాజన్, నారాయణి ఆస్పత్రి డైరెక్టర్ బాలాజీ, భక్తులు పాల్గొన్నారు.

9న దువ్వూరి రామిరెడ్డి జయంతి

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'జనని' సాంఘిక సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నవంబరు 9వ తేదీన 'కవి కోకిల' దువ్వూరి రామిరెడ్డి 130వ జయంతి కార్యక్రమం జరగనుంది. మైలాపూర్ లజ్‌లో ఉన్న శ్రీ పొట్టిశ్రీరాములు స్మారక భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో నిడమర్తి వసుంధరాదేవి ప్రార్థనాలాపన చేయనుండగా, జనని వ్యవస్థాపకుడు గుడిమెట్ల చెన్నయ్య స్వాగతం పలకనున్నారు. జనని అధ్యక్షురాలు డాక్టర్ నిర్మలా పళనివేలు అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి నెల్లూరులోని దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్టు కార్యదర్శి బి.సురేంద్రనాథ రెడ్డి ముఖ్య అతిథిగా, పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్ రెడ్డి, మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు, గౌరవ అతిథిగా వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, ఆత్మీయ అతిథిగా గాయని ఎస్పీ వసంతలక్ష్మి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని జనని వ్యవస్థాపకుడు గుడిమెట్ల చెన్నయ్య విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఆయుష్మాన్ భారత్‌తో ప్రజలకు మరింత భద్రత

● బీజేపీ నేత కిరణ్‌కుమార్



హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్న పళ్లిపట్టు అధ్యక్షుడు కిరణ్‌కుమార్

తిరుత్తణి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని సామంతవాడలో శనివారం ఉదయం పళ్లిపట్టు మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆయుష్మాన్‌భారత్ హెల్త్‌కార్డుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధాని మోదీ నాయకత్వంలో త్వరలోనే ప్రపంచంలో భారత్ అగ్రరాజ్యంగా ఎదుగుతుందన్నారు. ఆయుష్మాన్‌భారత్ పథకంతో రాష్ట్రప్రజలకు మరింత భద్రత లభిస్తుందన్నారు. అనంతరం పళ్లిపట్టు బీజేపీ నేతలు, నిర్వాహకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

క్రిస్మస్, అర్ధవార్షిక పరీక్షల సెలవులు

● రైళ్ల రిజర్వేషన్ ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, అర్ధవార్షిక పరీక్షల సెలవులకు రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైంది. పండుగలకు స్వగ్రామాలకు వెళ్లాలనుకునే ప్రయాణికులు 60 రోజులు ముందుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకునే వసతి అందుబాటులో ఉంది. ఈ క్రమంలో, ఈ ఏడాది క్రిస్మస్ పండుగను డిసెంబరు 25వ తేది క్రైస్తవులు జరుపుకోనున్నారు. అదే సమయంలో, రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో అర్ధవార్షిక పరీక్షలు డిసెంబరు 2వ వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ముగిసిన వెంటనే పాఠశాలలకు సెలవులు ప్రకటించనున్నారు. క్రిస్మస్, అర్ధవార్షిక సెలవులకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల ముందస్తు రిజర్వేషన్ శనివారం ఉదయం ప్రారంభమైందని, రద్దీని పరిశీలించి అదనపు రైళ్లు నడపడంపై నిర్ణయం తీసుకుంటామని రైల్వే అధికారులు తెలిపారు.

ఘనంగా టీం ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్' స్నాతకోత్సవం



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న దృశ్యం

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'టీమ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్' 21వ స్నాతకోత్సవం శుక్రవారం చెన్నైలో ఘనంగా జరిగింది. తమిళనాడు సహా దుబాయ్, జపాన్, యూఏఈ, ఖతర్ వంటి దేశాలకు చెందిన మొత్తం 570 మంది విద్యార్థులు ఈ సందర్భంగా డిగ్రీలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ప్రిన్సిపాల్ అమలా దాస్ పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి టీం ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ వ్యవస్థాపకులు ఫెలిక్స్ మైఖేల్, అన్నా స్టెఫీ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా మాంటిస్సోరి ఉపాధ్యాయులను రూపొందించాలన్నదే తమ లక్ష్యమని, ఇందుకోసం మెరుగైన శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వారంతా ప్రస్తుతం ప్రఖ్యాత పాఠశాలల్లో ఉద్యోగాలు పొందడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి వరకూ 4500 మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో అగ్రశ్రేణి కంపెనీల్లో విజయవంతంగా నియామకాలు పొందారని వివరించారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై ప్రచారం



కాశిమేడులో అవగాహన కరపత్రాలు అందిస్తున్న పోలీసు అధికారులు

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ ఉత్తర్వులతో చెన్నై సహా శివారు ప్రాంతాల్లో పోలీసు అధికారులు మాదకద్రవ్యాల అనర్థాపై ప్రజలు అవగాహన కల్పిస్తున్నారు. వాషర్‌మెన్‌పేట పోలీసు జిల్లా పరిధిలోని కాశిమేడు చేపల మార్కెట్‌లో ఎక్సైజ్, శాంతి భద్రతల విభాగాల అధికారులు శనివారం అవగాహన ప్రచారం చేపట్టారు. మాదకద్రవ్యాల వినియోగం, అనర్థాలు, మాదకద్రవ్యాలు తరలిస్తే చేపట్టే చర్యలు తదితరాల కరపత్రాలను జాలర్లు, చేపల కొనుగోలుకు వచ్చిన ప్రజలకు పోలీసులు అందజేశారు. అలాగే, సారా విక్రయాలు, మాదకద్రవ్యాలపై నెం.10581 కు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.

హౌసింగ్‌కాలనీలో కూల్చివేత పనుల ప్రారంభం



భవనాలను కూల్చివేస్తున్న దృశ్యం

వేలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని సత్తువాచారి కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న తమిళనాడు హౌసింగ్ బోర్డు కాలనీలో 1980లో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కార్పొరేషన్ అధికారులు కూల్చివేత పనులు ప్రారంభించారు. 1980లో అప్పటి ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్కువ అద్దెకు ఇళ్లను అందించే విధంగా ఈ హౌసింగ్ కాలనీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అందులోని 54గృహాలను శనివారం ఉదయం కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. త్వరలో వీటి స్థానంలో నూతన భవనాలను నిర్మించి ప్రభుత్వ ఉద్యోగులకు అందించే విధంగా పథకం రూపొందించనున్నట్లు వేలూరు హౌసింగ్‌శాఖ అధికారులు తెలిపారు.

నేడు 'వేద విజ్ఞాన వేదిక' ఉపన్యాస కార్యక్రమం

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారవాహిక 166వ ప్రసంగ కార్యక్రమం ఈనెల 26న ఆదివారం జరగనుంది. స్థానిక టి.నగర్ విజయ రాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు నెల్లూరుకు చెందిన ఆధ్యాత్మిక సాహిత్య ఉపన్యాసకుడు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి 'విశ్వనరుడు - గుర్రం జాషువా' అనే అంశంపై ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

విజయ్‌తో ఎన్నికల పొత్తు లేదు

● టీటీవీ దినకరన్

అడయార్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హీరో విజయ్ అధ్యక్షతన ఉన్న టీవీకేతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ స్పష్టం చేశారు. ఆయన శనివారం పుదుకోటలో మీడియాతో మాట్లాడుతూ, వచ్చే శాసనసభ ఎన్నికల్లో అధికార డీఎంకే, విజయ్ సారథ్యంలోని టీవీకేల మధ్యే పోటీ ఉంటుందని తెలిపారు. మాజీ సీఎం కరుణానిధి మృతి తర్వాత ఎంకే స్టాలిన్ డీఎంకే అధ్యక్ష పగ్గాలు చేపట్టి తనను తాను అధ్యక్షుడిగా నిరూపించుకున్నారని గుర్తు చేశారు. కానీ, జయలలిత మృతి తర్వాత ఈపీఎస్ పార్టీ పగ్గాలు చేపట్టి తనను తాను నిరూపించుకోలేకపోయారన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో డీఎంకే వర్సెస్ టీవీకే మధే పోటీ ఉంటుందన్నారు.

ప్రభుత్వం చట్టం తెస్తే కోడిపందేలకు అనుమతి : హైకోర్టు

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టులాగే రాష్ట్ర ప్రభుత్వం చట్టం తెస్తే కోడిపందేలకు కూడా అనుమతిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. కారైక్కేనిలో ఈ నెల 26న కోడిపందేలకు అనుమతించేలా పేరయూర్ తహసీల్దార్, టి.కల్లుపట్టి ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించాలని కోరుతూ మదురై జిల్లా కారైక్కేని మూవేందన్ హైకోర్టు మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ జి.ఆర్.స్వామినాథన్ స్పందిస్తూ.. వినోదం కోసం ఏదైనా జంతువును మరొక జంతువుతో పోరాడటానికి ప్రేరేపించేలా పోటీలు నిర్వహిస్తే జంతువుల చిత్రవధ నిరోధక చట్టం శిక్షిస్తుందని తెలిపారు. కోడిపందేలాకు అనుమతులు ఇవ్వరాదని డీజీపీ సర్క్యులర్ జారీ చేశారని గుర్తుచేశారు. పందేల సమయంలో కోడి కాళ్లకు కత్తులు కట్టరాదనే షరతుతో సుప్రీంకోర్టు ఇతర రాష్ట్రాల్లో అనుమతి ఇచ్చిందని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 మేరకు సుప్రీంకోర్టు ఏదైనా ఉత్తర్వులు జారీ చేయవచ్చని, హైకోర్టులకు అలాంటి ప్రత్యేక హక్కులు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొస్తే, పిటిషన్‌దారుడికి హక్కు ఉంటుందన్నారు.

● కరూర్ విషాదం

టీవీకే నాయకులను విచారించనున్న సీబీఐ

పెరంబూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో విజయ్ సభలో తొక్కిసలాట వ్యవహారంలో టీవీకే నాయకులను వేర్వేరుగా పిలిచి విచారణ చేపట్టాలని సీబీఐ నిర్ణయించింది. కరూర్ వేలుచ్చామిపురంలో గత నెల 27వ తేది టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగిన 41 మంది మృతిచెందిన వ్యవహారంపై సుప్రీంకోర్టు ఉత్తర్వులతో సీబీఐ విచారణ చేపట్టింది. కరూర్ టౌన్ పోలీసులు, ఐజీ ఆశ్రా గార్గ్ నేతృత్వంలోని ప్రత్యేక విచారణ కమిటీ అందజేసిన నివేదిక తదితరాల ఆధారంగా కొత్త ఎఫ్ఐఆర్‌ను తయారుచేసిన సీబీఐ, ఈ నెల 22న కరూర్ ప్రిన్సిపల్ క్రిమినల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఛార్లెస్ ఆల్బర్ట్ సమక్షంలో దాఖలు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లో, టీవీకే ప్రధాన కార్యదర్శి ఆనంద్, ఉప ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్, కరూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి మదిఅళగన్, కరూర్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి పవున్‌రాజ్ తదితరులపై 5 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సీబీఐ విచారణ పూర్తయి పూర్తి నివేదిక దాఖలు చేసిన సమయంలో, ఈ ఘటనకు బాధ్యులెవరు? అనే విషయమై స్పష్టత రానుంది.

విమాన అత్యవసర తలుపు తెరిచేందుకు యత్నం

చెన్నై, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విమాన అత్యవసర తలుపు తెరిచేందుకు యత్నించిన ప్రయాణికుడిని అధికారులు విచారిస్తున్నారు. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శ్రీలంక రాజధాని కొలంబోకు శుక్రవారం 168 మంది ప్రయాణికులతో ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం బయల్దేరేందుకు సిద్ధంగా ఉంది. ఆ సమయంలో విమానంలోని అత్యవసర తలుపు సమీపంలోని సీటులో కూర్చున్న గుజరాత్ రాష్ట్రానికి చెందిన లక్ష్మణన్ (45) అత్యవసర తలుపు తెరిచేందుకు యత్నించాడు. ఈ విషయాన్ని విమాన సిబ్బంది విమానాశ్రయం కంట్రోల్ రూంకు సమాచారం అందించారు. భద్రతా అధికారులు విమానంలోకి వెళ్లి లక్ష్మణన్‌ను విచారించారు. అత్యవసర తలుపు అని తెలియదని లక్ష్మణన్ అధికారులకు తెలియజేశాడు. అతని వివరణ అంగీకరించని అధికారులు, అతన్ని విమానం నుంచి దించేసి విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు.

వరుడి ఆత్మహత్య

ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూర్ సమీపంలోని కన్నన్‌తాంగల్‌లో వరుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కన్నన్‌తాంగల్‌కు చెందిన మహేష్‌కుమార్ (25) శ్రీపెరంబుదూర్‌లో ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సమయంలో ఆ కంపెనీలో పనిచేస్తున్న వెన్నిల (23)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి వివాహం దాక వచ్చింది. అయితే, వీరి మధ్య విభేదాల కారణంగా మహేష్‌ను వివాహం చేసుకోనని వెన్నిల మొండికేసినట్లు సమాచారం. దీంతో తనను మోసం చేశాడని మహేష్‌కుమార్‌పై వెన్నిల ఈ నెల 22వ తేదీ శ్రీపెరంబుదూర్ మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్రేమజంటతో చర్చించి శుక్రవారం వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి మహేష్‌కుమార్ తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

అధికారులను ప్రశ్నించడం తప్పా?

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై

ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీపెరంబదూర్ నియోజకవర్గ పరిధిలోని చెంబరంబాక్కం జలాశయం నుంచి ఇటీవల అదనపు జలాల విడుదలపై తనకు సమాచారం తెలియజేయని అధికారులను ప్రశ్నించడం తప్పా? అని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్యే సెల్వపెరుంతగై వాపోయారు. స్థానిక రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవనంలో స్వాతంత్ర సమరయోధుడు చట్టనాథ కరయార్ 116వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించిన అనంతరం సెల్వపెరుంతగై మీడియాతో మాట్లాడారు. భారీవర్షాల కారణంగా పూర్తిస్థాయిలో నిండిన జలాశయాల భద్రతను దృష్టిలో ఉంచుకుని అదనపు జలాలను విడుదల చేయడంపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు. అయితే చెంబరంబాక్కం జలాశయం నీటి విడుదల చేసిన వ్యవహారంలో జిల్లా కలెక్టర్ కలైసెల్వి, నీటి పారుదలశాఖ అధికారులు తనను సంప్రదించలేదన్నారు. దీనిపై అధికారులను ప్రశ్నించిన తనను సీనియర్ మంత్రి దురైమురుగన్ తప్పుబట్టారని, ఎమ్మెల్యేగా తనకు అధికారులను ప్రశ్నించే హక్కులేదా? అని మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్ఏ వాసు, హసీనా సయ్యద్, నరేష్‌కుమార్, స్వర్ణా సేతురామన్ తదితరులు పాల్గొన్నారు.



రాధిక (ఫైల్‌ఫొటో), అరెస్టయిన ప్రిన్స్ నవీన్

టీచర్ ఆత్మహత్య

● పాఠశాల కరస్పాండెంట్ కుమారుడి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వివాహం పేరుతో యువకుడు చేసిన మోసాన్ని జీర్ణించుకోలేక మహిళా టీచర్ ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. విరుదాచలం సమీపం లోని పుదువిలంగుళం గ్రామానికి చెందిన వేల్ కుమార్తె రాధిక (35)అదే ప్రాంతంలో ఉన్న అమలా ప్రైవేటు ప్రాథమిక పాఠశాలలో 13యేళ్లుగా టీచర్‌గా పనిచేసింది. ఈ నేపథ్యంలో, ఆమె ఈనెల 19న ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యుల సమాచారంతో మంగళంపేట పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని విరుదాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రాధిక తండ్రి ఫిర్యాదు మేరకు మంగళంపేట పోలీసులు కేసు నమోదు చేసి ఆ పాఠశాల కరస్పాండెంట్ కుమారుడు ప్రిన్స్ నవీన్ (37)ను శుక్రవారం అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు ఉత్తర్వులు మేరకు రిమాండ్‌కు తరలించారు.